శ్రీ చైతన్య స్కూల్‌కు ఎన్‌డిసిఎ అవార్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యావేత్తలు, వివిధ రంగాల్లో ప్రావీణ్యమున్న వారిని గుర్తించి గౌరవించే నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ (ఎన్‌డిసిఎ) 10వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్, డైరెక్టర్‌ను సన్మానించింది. శ్రీ చైతన్య స్కూల్‌ను బెస్ట్ స్కూల్ ఇన్ ఇండియాగా, శ్రీ చైతన్య డైరెక్టర్ సీమను బెస్ట్ అకడమిక్ డైరెక్టర్‌గా ప్రకటించింది. విద్యా రంగంలో దశాబ్దాలుగా అందిస్తున్న సేవలకుగానూ ఈ అవార్డులను ప్రకటించడం జరిగిందని ఎన్‌డిసిఎ ప్రతినిధులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో శ్రీ చైతన్య డైరెక్టర్ సీమను కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ఎన్‌డిసిఎ ప్రతినిధులు బింగి నరేంద్ర గౌడ్, డాక్టర్ విజయ్‌కుమార్ సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీమ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లీదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి ఫలితంగానే ఇంతటి విజయం సాధ్యమైందని తెలిపారు.

నాందేడ్‌లో నేడు బిఆర్‌ఎస్ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం బిఆర్‌ఎస్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. బహిరంగసభ వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నాందేడ్ పట్టణానికి నలువైపులా కిలోమీటర్ల మేర గులాబీ రంగు సంతరించుకుంది. వరుస క్రమంలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగులు, బెలూన్లు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ సిఎం కెసిఆర్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో.. సభ ఏర్పాట్లను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. బిఆర్‌ఎస్‌గా పార్టీ రూపాంతరం చెందిన తర్వాత జాతీయస్థాయిలో జరుగుతున్న తొలి సభ కావడంతో అధిష్ఠానం దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితోపాటు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు జోగు రామయ్య, షకీల్, టీఎస్ఐఐసీ ఛైర్మన్ గాదరి బాలమల్లు, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ రవీందర్ సింగ్ గత కొన్ని రోజులుగా ఇక్కడే ఉంటూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో తండ్రీకూతుళ్ల మృతి

- బావిలో ముగ్గురి మృతదేహాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుమానాస్పద స్థితిలో తండ్రీ, ఇద్దరు కూతుళ్లు మృతిచెందారు. ఈ సంఘటన జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో శనివారం వెలుగుచూసింది. నర్సింగాపూర్‌కు చెందిన గడ్డం జలపతిరెడ్డి (40)కి ఇద్దరు కుమార్తెలు ప్రణిత్య (11), మధుమిత(9). ముగ్గురూ శుక్రవారం సాయంత్రం శుభకార్యానికి వెళ్తున్నామని పక్క గ్రామానికి బయలుదేరారు. శనివారం ఉదయం జలపతిరెడ్డి సోదరుడు పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా.. వ్యవసాయ బావిలో మృతదేహాలు కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మోటార్ల సాయంతో బావిలో నీటిని తోడేసి.. జలపతి, ఇద్దరు కుమార్తెల మృతదేహాలను వెలికి తీశారు. అక్కడ సూసైడ్ నోట్ లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. జలపతి మృతదేహంపై గాయాలు ఉండడంతో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మనోధైర్యం ముఖ్యం

నిమ్స్‌లో కేన్సర్ డే వాక్‌లో డాక్టర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేన్సర్‌ను జయించేందుకు మనోధైర్యం ముఖ్యమని నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. శనివారం వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా నిమ్స్ ఆస్పత్రిలో వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ గుండేటి సదాశివుడు మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ , ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆకాష్ బైజూస్ నుంచి కెవైఎన్ కిట్

హైదరాబాద్ : నీట్ అభ్యర్థుల కోసం తొలిసారి వినూత్నమైన సెల్ఫ్ ఇవాల్యుయేషన్ టూల్ నో యువర్ ఎన్‌సిఇఆర్‌టి (కెవైఎన్) ఆవిష్కరించినట్లు ఆకాష్ బైజూస్ తెలిపింది. శనివారం హైదరాబాద్‌లో దీనిని ఆ సంస్థ ప్రతినిధులు మధుసుధన్‌రెడ్డి, టిఎల్ నరసింహన్, భారత్ మందాడి, వరుణ్ సోనీ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ టూల్ కిట్ క్యూరేటెడ్ మాడ్యుల్స్‌ను 11, 12వ తరగతి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విద్యార్థుల కోసం అందుబాటులోకి తెచ్చామని వారు తెలిపారు. ఇది అసంఖ్యాక ప్రశ్నలను ప్రతి చాప్టర్ తరువాత విభిన్న రూపాలలో నీట్ విధానానికి అనుగుణంగా అందిస్తుందని పేర్కొంది. ఇది లోతైన విశ్లేషణ ద్వారా విద్యార్థులకు పూర్తి అవగాహన అందించనుందన్నారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల గౌరవ వేతనం రూ.3 వేలకు పెంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజనం (పిఎం పోషణ్) కార్మికుల గౌరవ వేతనాన్ని రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం వారికి రూ.వెయ్యి చెల్లిస్తున్నామని తెలిపారు. ఇందులో కేంద్రం రూ.400, రాష్ట్రం రూ.600 భరిస్తాయని పేర్కొన్నారు. గౌరవ వేతనం రూ.మూడు వేలకు పెంచడంతో ఇందులో కేంద్రం రూ.600, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,400 (అదనంగా రూ.2 వేలు) చెల్లిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా 60 శాతం, కేంద్రం 40 శాతం నిష్పత్తి ప్రకారం వేతనాన్ని చెల్లిస్తాయని వివరించారు. గతేడాది మార్చి 15న అసెంబ్లీలో మధ్యాహ్న భోజనం వంట కార్మికుల గౌరవ వేతనం రూ.మూడు వేలకు పెంచుతామంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది వంట కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ హర్షం

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికుల గౌరవ వేతనాన్ని రూ.మూడు వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేయడం పట్ల తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేతన పెంపు కోసం తమ సంఘం అనేక పోరాటాలను చేసిందని గుర్తు చేశారు. ఇది ముమ్మాటికీ సుదీర్ఘ పోరాటాల వల్ల దక్కిన విజయమేనని తెలిపారు. గతేడాది మార్చి 15న సిఎం చేసిన ప్రకటన ఆధారంగా అప్పటి నుంచి బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. జిఒ నంబర్ 8 విడుదలను స్వాగతిస్తూ ఈనెల ఆరు, ఏడు, ఎనిమిది తేదీల్లో మండల కేంద్రాల్లో, 12న జిల్లా కేంద్రాల్లో విజయోత్సవ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల హక్కుల కోసం పోరాట కార్యాచరణను తీసుకుని ముందుకు సాగుతామని తెలిపారు.

దొంగపై దాడిని దేశంపై దాడిగా చెప్తారా..?

- దేశమంటే ప్రధాని, అదానీ మాత్రమే కాదు
- కేంద్రానికి కార్పొరేట్లే ముఖ్యం
- కామన్ మ్యాన్ దృష్టితోనే తెలంగాణ పాలన
- తెలంగాణ ప్రగతిరథ చక్రాలు ఆపడం ఎవరితరం కాదు
- అసెంబ్లీలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఆర్థిక దొంగల బండారం బైటపడితే దాన్ని దేశంపై జరిగిన దాడిగా అభివర్ణించడం ఏమిటి..? దేశమంటే ప్రధాని, అదానీ మాత్రమే కాదు... 140 కోట్ల ప్రజలని వాళ్లకు చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. దేశంలో అదానీ-ప్రధాని తప్ప మరో చర్చ లేదు" అని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని శనివారం అసెంబ్లీలో సీనియర్ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రవేశపెట్టారు. దానిపై మంత్రి కెటిఆర్ మాట్లాడారు. తెలంగాణ ప్రగతిలాగే దేశం పరుగులు పెట్టి ఉంటే 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ కల ఎప్పుడో నెరవేరేదని కెటిఆర్ చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసమే కాకుండా దేశ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, సంక్షేమానికి ఒక బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధుల ప్రభుత్వంగా కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ ప్రజలకు అందుతున్న అద్భుతమైన పరిపాలనా ఫలాలు.. దేశ ప్రజలకు కూడా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రం సహకరించినా.. సహకరించకపోయినా తెలంగాణ ప్రజలకు మంచి చేయాలన్న తమ నిబద్ధతను ఎవరూ దెబ్బతీయలేరని మంత్రి కెటిఆర్ స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ ప్రగతి రథచక్రాలను ఆపడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. కేంద్ర సర్కారుకు కార్పొరేట్ ముఖ్యమేమోగానీ, మాకు మాత్రం కామన్ మ్యానే ముఖ్యం. సామాన్య ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ



సంకల్పమని పునరుద్ఘాటించారు. దేశంలో కావాల్సింది డబుల్ ఇంజన్ సర్కారు కాదు.. తెలంగాణ లాంటి డబుల్ ఇంపాక్ట్ సర్కార్ అని కెటిఆర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి నమూనా ఖదేశానికి స్ఫూర్తినిస్తోందని చెప్పారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న తెలంగాణ పథకాలను ఆయా రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. అందుకే తెలంగాణ మోడల్ దేశవ్యాప్తం కావల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తెలంగాణలో కెసిఆర్ కుటుంబపాలన నడుస్తోందని ప్రతిపక్షాలు చేస్తోన్న విమర్శలపై మంత్రి కెటిఆర్ స్పందిస్తూ, ముమ్మాటికి మాది కుటుంబ పాలనే అని తెలిపారు. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది మా కుటుంబసభ్యులే.. ఈ కుటుంబానికి పెద్ద కెసిఆర్ అని స్పష్టం చేశారు.

"దేశంలోని ఏ రాష్ట్రంలో.. ఏ ముఖ్యమంత్రి ప్రతి కుటుంబంలోని అవ్వ, తాతకు పెన్షన్లు ఇచ్చి ఒక పెద్ద కొడుకులా నిలబడ్డడు. ఒక్క కెసిఆర్ తప్ప. నాలుగు కోట్ల మంది తోబుట్టువులను దగ్గర ఉండి చూసుకుంటున్నది కెసిఆర్ కాదా.? కంటి వెలుగుతో వృద్ధుల జీవితాల్లో కొత్త వెలుగులు ఇస్తున్నది కెసిఆర్ కాదా? గురుకులాలు, జూనియర్ కాలేజీలు, మెడికల్ కళాశాలలు తెరిచి లక్షలాది మందికి నాణ్యమైన విద్య అందిస్తున్నది కెసిఆర్ కాదా? ఊహించని విషాదంతో ఒంటరిగా మిగిలిన చెల్లెళ్లకు ఒంటరి మహిళ పెన్షన్లు ఇస్తున్నది వాళ్ల పెద్దన్న కెసిఆర్ కాదా? బస్తీల్లోని పసిబిడ్డ అయినా.. బంజారాహిల్స్‌లో పుట్టిన బిడ్డకు అయినా సమానంగా సకల సౌకర్యాలు అందించేందుకు కెసిఆర్ కిట్‌కు రూపకల్పన చేసి కంటికిరెప్పలా కాపాడుతున్న మేనమామ కెసిఆర్ కాదా? పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ కింద 12 లక్షల మంది ఆడబిడ్డలకు పెళ్లి చేసిన మేనమామ కెసిఆర్ కాదా? 65 లక్షల మంది రైతులకు 65 వేల కోట్లు ఇచ్చి అన్నగా నిలబడినది కెసిఆర్ కాదా? అని మంత్రి కెటిఆర్ ప్రశ్నిం చారు. తెలంగాణతో కెసిఆర్‌కు ఉన్న పేగు బంధాన్ని తెంపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదని కెటిఆర్ స్పష్టం చేశారు.

CHANGE OF NAME

I, ANIL KUMAR TIBREWALLA (Old Name) S/o Parmeshwar Lal Tibrewalla, R/o H.No:3-5-796, Flat No.511, Mahaveer Apartment, King Koti Road, Hyderabad-500029, TS. Have changed my name to **ANIL TIBREWALLA (New Name)** for all future purposes.

సిఎం కెసిఆర్‌తో పలు రాష్ట్రాల నేతలు భేటీ

బిఆర్‌ఎస్‌లో చేరేందుకు సంసిద్ధత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ అధినేత సిఎం కెసిఆర్ గారితో మహారాష్ట్రకు చెందిన పలువురు మాజీ ఎంపీలు, జిల్లా చైర్మన్లు, సీనియర్ నాయకులు భేటీ అయ్యారు. సిఎం సారథ్యంలో తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, దళిత బంధు, ఉచిత విద్యుత్తు, ఆసరా పింఛన్లు తదితర పథకాలు, దాంతో పాటు తెలంగాణలో అప్రతిహతంగా కొనసాగుతున్న పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి మరియు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమ వివరాలను సిఎం గారిని అడిగి తెలుసుకున్నారు. బిఆర్‌ఎస్ జాతీయ పార్టీగా పరిణామం చెందడాన్ని ఆహ్వానించిన మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎంపిలు, సీనియర్ నేతలు, దేశ రాజకీయాల్లో కెసిఆర్ వంటి ప్రత్యామ్నాయ ప్రగతి కాముక రాజకీయ నాయకత్వం నేడు ఎంతగానో అవసరం ఉందన్నారు.

బిఆర్‌ఎస్ పార్టీ విధివిధానాల గురించి వారు సుదీర్ఘంగా చర్చించారు. తాము పార్టీలో చేరడానికి తమ సంసిద్ధతను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా సిఎంతో భేటీ అయిన వారిలో.. ఛత్తీస్‌గడ్‌కు చెందిన నేషనల్ యునైటెడ్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గోపాల్ రిషికార్ భారతి, మధ్యప్రదేశ్ బాలాఘాట్ మాజీ ఎంపీ బోధ్ సింగ్ భగత్, మహారాష్ట్ర బండారా మాజీ ఎంపీ కుషాల్ బోప్చే, చత్తీస్ ఘర్ సారంగద్ మాజీ మంత్రి డాక్టర్ చబ్బీలాల్ రాత్రే, గడ్చిరోలి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పసుల సమ్మయ్యపోచమ, రిపబ్లికన్ పార్టీ గడ్చిరోలి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ శంకర్, సిద్ధిపేట జిల్లా బిఆర్‌ఎస్ నాయకుడు అంబటి బాలచంద్ర గౌడ్ తదితరులు ఉన్నారు.

హరికథ ప్రాభవానికి రమణాచారి కృషి

విశ్రాంత సివిల్ అధికారి ఎం.వి.ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - కల్చరల్

హరికథ ప్రాభవానికి రమణాచారి చేస్తోన్న కృషి, సనాతన సంప్రదయ కళకు తన అరచేతిని అడ్డుపెట్టి కాపాడే ప్రయత్నమేనని ప్రముఖులు ప్రశంసించారు. రవీంద్రభారతి ప్రాంగణంలోని ఘంటసాల కళావేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణ జన్మదిన సందర్భంగా జరుగుతున్న హరికథ సప్తాహంలో భాగంగా జరిగిన సభా కార్యక్రమంలో అతిథిగా విశ్రాంత సివిల్ అధికారి ఎం.వి.ఎస్.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. హరికథకులకు రమణాచారి ఇస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ పి.మధుసూధనరావు మాట్లాడుతూ హరికథ కళా ప్రక్రియ తెలుగు వారి సంపద అన్నారు. డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్న సభకు రఘురాం స్వాగతం పలుకగా సుబ్బారావు వందన సమర్పణ చశారు. అనంతరం రాంబాబు శ్రీకృష్ణ రాయబారం హరికథ గానం చేశారు.

కెపిహెచ్‌బి ఫేస్-13లో బిఒబి ఎటిఎం

బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) కూకట్‌పల్లిలోని ఇందు ఫోర్చ్యూన్ ఫీల్డ్స్ గార్డెనియాలో నూతన ఎటిఎం కేంద్రాన్ని తెరిచింది. కెపిహెచ్‌బి, ఫేస్-13లో ఏర్పాటు చేసిన దీన్ని ఆ బ్యాంక్ హైదరాబాద్ జోన్ సిజిఎం మన్మోహన్ గుప్తా లాంఛనంగా ప్రారంభించారు.

సింగరేణి ఆర్‌జీ-3లో ప్రమాదం

ఫైర్ ఎక్స్‌నేంజర్ పేలి వెల్డర్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి ఆర్‌జీ-3లో ఫైర్ ఎక్స్‌నేంజర్ పేలడంతో అక్కడే ఉన్న వెల్డర్ బట్టి జైనాథ్ కుమార్(28) ప్రాణం కోల్పోయారు. పెద్దపల్లి జిల్లాలోని సింగరేణి ఆర్‌జీ-3 ఏరియాలో శనివారం ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. సింగరేణి ఆర్‌జీ-3 ఏరియాలోని సిహెచ్‌పి సర్ఫేస్ ఫీడర్ దగ్గర మొదటి షిఫ్ట్‌లో బట్టి జైనాథ్ కుమార్ ఉన్నారు. వెల్డింగ్ పని పూర్తి చేసుకుని వెళ్లే సమయంలో ఫీడర్ పక్కన గల ఫైర్ ఎక్సనేంజర్ పేలింది. ఈ ప్రమాదంలో జైనాథ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. కార్మికునికి భార్య,కొడుకు ఉన్నారు. మృతుని స్వస్థలం కొత్తగూడెంలోని చంచుపల్లి గ్రామం.

తెలంగాణ భారతదేశంలో భాగం కాదా?

- మెడికల్, నర్సింగ్ కాలేజీలు కేటాయించరా?
- బిజెపి సర్కార్‌పై పల్లా ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణపై కేంద్రంలోని బిజెపి సర్కార్ వివక్ష చూపిస్తున్నదనీ, ఈ రాష్ట్రం భారతదేశంలో భాగం కాదా? అని టిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆయన ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. గతంలో దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలకు అనుమతించి తెలంగాణను విస్మరించారనీ, తాజాగా 157 నర్సింగ్ కాలేజీల విషయంలోనూ అదే విధంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సొమ్మును గుజరాత్‌తో పాటు ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం సహకరించకున్నా, ప్రతిపక్ష పార్టీలు అడుగడుగునా అడ్డుకున్నా బిఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం విద్య, ఉపాధి, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని వివరించారు. గత పదేండ్లలో వ్యవసాయాభివృద్ధిలో రాష్ట్రానికి దేశంలోనే రెండో స్థానం దక్కిందనీ, వైద్యారోగ్య రంగంలో మూడో స్థానంలో నిలిచిందని ఉదహరించారు. సిఎం కెసిఆర్ సంపదను సృష్టిస్తుంటే ప్రధాని కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని విమర్శించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ తీర్మానాన్ని బలపరుస్తూ, దళితులు, గొల్ల కురుమలు, గంగపుత్రులు, ముదిరాజ్‌లు, గౌడ తదితర సామాజిక వర్గాల సంక్షేమానికి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. జర్నలిస్టుల నిధికి రూ.100 కోట్లు కేటాయించిన సీఎం కేసీఆర్ వారికి స్థలాలిచ్చేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

ప్రయివేటు ఆస్పత్రులు మూతపడే పరిస్థితి

ప్రభుత్వాస్పత్రుల్లో పెరిగిన వసతులు, సౌకర్యాలతో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోగులు వైద్యాన్ని పొందుతున్నారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. దీంతో ప్రయివేటు ఆస్పత్రులు మూతపడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ వల్ల పెట్టుబడులను పెద్ద ఎత్తున ప్రభుత్వం ఆకర్షించిందన్నారు.

కేంద్రం సహకరించకున్నా....

కేంద్రం సహకరించకున్నా, ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డుపడినా అన్ని రాష్ట్రాలకు ప్రేరణ, ఉత్సేజం ఇచ్చేలా తెలంగాణను ప్రగతిపథంలో నడిపిన వ్యక్తి సిఎం కెసిఆర్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొనియాడారు. ఈ విషయాలను రాష్ట్ర గవర్నర్ ప్రసంగంలో కూలంకషంగా చెప్పారని గుర్తు చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు కంటి వెలుగు బాగుందంటూ వారి రాష్ట్రాల్లో అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రజల తలసరి ఆదాయమే అభివృద్ధికి కొలమానమంటూ, 2014లో రూ.1,24,104గా ఉన్న తలసరి ఆదాయం రూ.3,17,118కి పెరిగిందని తెలిపారు. మహిళలు, శిశువుల సంక్షేమం, ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. నిజామాబాద్ సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతానికి చెందిన గ్రామాలు తమనూ తెలంగాణలో కలపాలంటూ తీర్మానాలు చేయడం రాష్ట్రానికే గర్వకారణమని తెలిపారు. ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ సిఫారసుల మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి ఒక శాతం వాటా తీసుకుని ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూళ్లు, ఎయిడెడ్ స్కూళ్ల సిబ్బందికి దీన్ని వర్తింపజేయాలన్నారు.

ఫ్రాన్స్ న్యూక్లియర్ టర్బైన్లకు విడిభాగాలు

అజాద్ ఇంజినీరింగ్ వెల్లడి

హైదరాబాద్ : ఫ్రాన్స్ అణు టర్బైన్లకు విడి పరికరాలను సరఫరా చేస్తున్నట్లు ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్ తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఈ కంపెనీ న్యూక్లియర్ టర్బైన్‌లకు అవసరమయ్యే కీలక భాగాలను సరఫరా చేసినట్టు వెల్లడించింది. ఫ్రాన్స్‌లోని బెల్ఫోర్ట్‌లో అణు టర్బైన్లను అసెంబుల్ చేసేందుకు ఉపయోగపడే ఈ భాగాల మొదటి సెట్‌ను డెలివరీ చేసినట్టు పేర్కొంది. జిఇ స్టీమ్ పవర్‌తో ఉన్న దీర్ఘకాలిక ఒప్పందం వల్లే, ప్రపంచ వ్యాప్తంగా న్యూక్లియర్ విభాగంలో పెద్ద వ్యాపార అవకాశాన్ని దక్కించుకున్నట్లు ఆజాద్ ఇంజినీరింగ్ ఎండి రాకేష్ ఛోప్దార్ తెలిపారు. ప్రపంచ మార్కెట్‌కు న్యూక్లియర్ విడిభాగాలు సరఫరా చేసిన తొలి భారతీయ కంపెనీ తమదేనని ఆజాద్ ఇంజినీరింగ్ ఎండి రాకేష్ ఛోప్దార్ అన్నారు. ఐదేళ్లపాటు తమ ప్రగతి ప్రస్తానం కొనసాగుతుందన్నారు. దేశంలో అణు విడిభాగాల తయారీకి ఆమోదం పొందిన మొదటి, ఏకైక కంపెనీ తమదే కావడం గర్వంగా ఉందన్నారు.

దావా నోటీసు
మహారాజశ్రీ తెనాలి 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 436/2020

బిట్వీన్ :
సోమరౌతు సుజాత, వగైరాలు ... వాదులు
వర్సెస్
సోమరౌతు సాంబశివరావు, వగైరాలు ... ప్రతివాదులు టు

డి1 : సోమరౌతు సాంబశివరావు, తండ్రి : ధనేశ్వరరావు (లేటు), డోర్ నెం.9-4-49, దయానందవీధి, తెనాలి.
డి3 : ప్రత్తి కనకదుర్గ, భర్త : దుర్గా ప్రసాద్ (లేటు), డోర్ నెం.12-14-26/1, చిన్నావారి వీధి, తెనాలి.
డి5 : మాదల సూర్యకళ, భర్త : శ్రీనివాస్, తండ్రి : లేటు సోమరౌతు ధనేశ్వరరావు, ఆర్/ఓ, ప్లాట్ నెం.402, జయభేరి టవర్స్, నాగోల్ మెయిన్‌రోడ్డు, న్యూ నాగోల్, కొత్తపేట, ఎల్.బి.నగర్, ఉర్బాన్, రంగారెడ్డి జిల్లా.
డి6 : సోమరౌతు పద్మ : భర్త : లేటు రఘు, డోర్ నెం.12-14-26/1, చిన్నావారి వీధి, తెనాలి.

పై నెంబరు దావాలో వాదులు మీపై పార్టీషన్ కొరకు దావా దాఖలు చేసుకొని, పై కోర్టువారి నుండి అనేకసార్లు మీకు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా కోర్టు నోటీసు తెలియజేయు నిమిత్తం ది. 27-2-2023నకు వాయిదా వేసియున్నారు. అందు విషయమై మీకు ఏమైనా అభ్యంతరములు వున్న యెడల మీకు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ, వాయిదాతేది ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరు కాబడి మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా మీకు తెలియపర్చుటమైనది.

వాయిదా: 27-02-2023

ఎన్.మహేశ్వరరావు,
వాదులు తరఫు అడ్వకేటు,
తెనాలి, గుంటూరు.
సెల్ : **99633 92377**

IN THE COURT OF HON'BLE IX ADDI CHIEF JUDGE COURT CITI CIVIL COURT AT:HYDERABAD
O.P.NO.2052 OF 2019

Between:
Human Singh Malik ...Petitioner
A N D
Manbhum Construction company Pvt Ltd. and other. ...Respondent

To,
1.Manbhum construction company pvt ltd, Rep by P.RamakrishnaRao, S/o.Late Dasharath Rao,R/o.H.No/.10-2-414/3, Road No.17,West Maredpally, Secunderabad. (Owner of car No.AP.10 BF 4800) ...R1
2.P.Ramakrishna Rao,S/o.Late Dasharath Rao,Occ:Business R/o.H.No/.10-2-414/3,Road no.17,West Maredpally,Secunderabad. (Owner of Car No.AP.10 BF 4800) ...R3

Take Notice that the above OP is filed agiamst you and others for grant of compensassion the Hon'ble court posted above case on 01-03-2023 at 10:30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.D.UMA SHANKER
A.V. Prabhakar, Advocates
H.No.2-1-444/A, Nallakunta, Hyderabad.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD
O.S. No. 2021 of 2020

Between:
M/s. State Bank of India
SME Centre Branch, Patny Centre, 1st floor, Secunderabad-500 003.
Represented by its Chief Manager …Plaintiff
AND
M/s. MS Rajalakshmi Ladies Hostel and another … Defendants

To
1. M/s. MS Rajalakshmi Ladies Hostel, Represented by its Proprietor G. Narasimha Rao, H. No. B-63, I & II Floor, Madhura Nagar, S.R. Nagar, Hyderabad-500 038.
2. G. Narasimha Rao, S/o G. Venkateswarlu, Aged about 34 years, Occ: Business, R/o Subbaiah Palem Post, Rompucherla (M), Turumella, Guntur District, Pin code: 522 617 (A.P.) … Defendants

SUMMONS

Whereas the Plaintiff filed above suit under Section 26 and Order 7 Rules 1 and 2 of CPC against you for recovery of a sum of Rs.10,13,190-00 Ps. together with current and future interest, costs and for other relief& #39;s. You are therefore hereby directed to appear before the Hon& #39;ble II Junior Civil Judge, City Civil Court, at Hyderabad, either in person or through an Advocate or duly authorized agent, in support of defense to show cause on 20.02.2023 at 10.30 A.M. as to why relief's prayed for should not be granted. Take notice that in case of default the matter will be heard and determined in your absence.

//By the order of the Court//

Sd/-
Dr. C.S. CHAKRAVARTHY
Counsel for the Plaintiff
H. No. 16-11-16/T/4, "Master's Nilayam", West Prasanth Nagar, Moosarambagh, Hyderabad-500 036.
Phones: 040-35888927,9391046708

సంతకాల సేకరణ చేపడుతున్న విద్యార్థి నాయకులు

బడ్జెట్‌లో ఓయూకు రూ.1000 కోట్లు కేటాయించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు అర్.ఎల్.మూర్తి
- సంతకాల సేకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీకి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అర్.ఎల్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఓయూలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. ఓయూకు ప్రభుత్వం కేటాయించే నిధులు వేతనాలు ఇవ్వడానికి మాత్రమే సరిపోతున్నాయని, యూనివర్సిటీలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకూ నోచుకోవడం లేదన్నారు. యూనివర్సిటీని నడిపించడానికి అధికారులు విద్యార్థుల మీద ఫీజుల భారం వేసే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల పరిస్థితీ ఈ విధంగానే ఉందని, రోజురోజుకు అవి నిర్వీర్యానికి గురవుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ 2.4 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని చెప్పారు.

రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణ కోసం 30 శాతం నిధులు కేటాయించి తన చిత్తశుద్ధిని సిఎం నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలపై అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించి వాటి సమగ్ర అభివృద్ధి కోసం తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. యూనివర్సిటీలో చదివే ప్రతి విద్యార్థికీ ఉచిత మెస్, స్కాలర్‌షిప్, ఫెలోషిప్ కూడా అందించే విధంగా తగిన బడ్జెట్ కేటాయించాలన్నారు. ఓయూ అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు, రవి మాట్లాడుతూ.. ఓయూకు నిధులు కేటాయించకపోతే అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సంతకాల సేకరణలో ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు శ్రీను, పవన్, సహాయ కార్యదర్శి కృష్ణ, అశ్విని, నాయకులు రమ్య, ప్రొఫెసర్లులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లస్థలాలివ్వాలి

- మన ఊరు - మనబడి పనులను పూర్తి చేయాలి
- సేద్యం చేయని భూములకు 'రైతుబంధు' ఇవ్వొద్దు
- మండలిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలివ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సొంత జాగా ఉన్న వారు ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపడుతున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భాషాపండితులు, పీఈటీలకు పదోన్నతులివ్వాలనీ, తద్వారా ఆ సమస్యకు ముగింపు పలకాలని సూచించారు. మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. కేజీబీవీ సిబ్బందికి స్థానచలనం కల్పించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. మల్లిఖార్జున్ అనే టీచర్‌పై మతోన్మాద మూకలు దాడిచేయడాన్ని ఖండించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో స్వేచ్ఛగా బోధించే వాతావరణం కల్పించాలని కోరారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ భార్యాభర్తలను ఒకే జిల్లాకు పంపారని చెప్పారు. అదే విధంగా ఎస్‌జిటిలను బదిలీ చేయాలని సూచించారు. దేశంలో, రాష్ట్రంలో సంపద ఒకేచోట కేంద్రీకృతమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో టీచర్లకు రూ.26 వేలు

చెల్లిస్తున్నారనీ, అదే పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులకు మాత్రం రూ.80 వేలకుపైగా వేతనం వస్తున్నదని వివరించారు. అందువల్ల కేజీబీవీ టీచర్లకు మినిమం బేసిక్ పే చెల్లించాలని కోరారు. కొత్త పరిశ్రమలొస్తున్నాయనీ, వాటి ద్వారా పెట్టుబడులు కూడా వస్తున్నాయంటూ ఆ శాఖ మంత్రి ప్రకటిస్తున్నారనీ, అదే తరహాలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంపై సంబంధిత శాఖ మంత్రి దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో 76 షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోను విడుదల చేయాలని చెప్పారు. ఐదు పరిశ్రమలకు సంబంధించి జిఒ జారీ చేసినా గెజిట్ కానందున అమలు కావడం లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)ను అభివృద్ధి చేస్తేనే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. ముగ్గురు డాక్టర్లు, ఆరుగురు నర్సులతో 24 గంటలూ పనిచేసేలా పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలను పటిష్టపర్చాలని సూచించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. శ్రీశైలం సొరంగమార్గం పనులను పూర్తి చేయాలని కోరారు. గురుకులాలు, కెజిబివిల్లో కేర్‌టేకర్లను నియమించాలని కోరారు. సేద్యం చేయని భూములకు రైతుబంధు ఇవ్వొద్దని అన్నారు. కౌలురైతులకు ఆ పథకాన్ని వర్తింపచేయాలని సూచించారు. మన ఊరు మనబడి పథకం ద్వారా మొదటి విడతలో 9,123 బడులను రూ.3,497 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు 1,210 స్కూళ్ల పనులే పూర్తయ్యాయని వివరించారు. మిగతా బడుల్లో పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్త బస్తీలు, కాలనీల్లో సర్కారు బడులు, కాలేజీలను ప్రారంభించాలని కోరారు.

మానవాభివృద్ధిలో కేరళ నంబర్‌వన్

మానవాభివృద్ధి సూచికల్లో కేరళ నంబర్‌వన్ స్థానంలో ఉందని నర్సిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఆ సూచికల్లో తెలంగాణ ఏ స్థానంలో ఉందో చెప్పాలని మంత్రి కెటిఆర్‌ను కోరారు. అక్కడ గ్రామీణ కార్మికుల రోజు వేతనం రూ.800గా ఉందన్నారు. ఇక్కడ రూ.400, రూ.500, రూ.600 మాత్రమే కూలి వస్తున్నదని అన్నారు. అక్షరాస్యతలో ఆ రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో దేశంలోనే తెలంగాణ రెండోస్థానంలో ఉందని వివరించారు.

కమ్యూనిస్టు ప్రభుత్వం ఏమీ చేయలేదని చెప్పడం లేదు : కెటిఆర్

నర్సిరెడ్డి లేవనెత్తిన అంశంపై మంత్రి కెటిఆర్ స్పందిస్తూ కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం అభివృద్ధి ఏమీ చేయలేదంటూ తాను చెప్పడం లేదని మంత్రి కెటిఆర్ అన్నారు. విద్యారంగంలో మార్పునకు నాంది ప్రారంభమైందని చెప్పారు. మన ఊరు మనబడి పథకం ద్వారా 680 పాఠశాలల్లో పనులు పూర్తిచేసి ప్రారంభించామన్నారు. రూ.7,300 కోట్లతో 26,085 సర్కారు బడుల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని అన్నారు. మానవాభివృద్ధిలో తెలంగాణ టాప్‌లోనే ఉంటుందన్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని శాసనమండలి ఆమోదించినట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం సభ సోమవారం ఉదయం 10.30 గంటలకు వాయిదా పడింది.

పేదల కడుపు కొట్టిన పెద్దల బడ్జెట్

- ప్రజావ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని, పేదల కడుపుగొట్టి, పెద్దలకు పెట్టిన చందంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని సిపిఎం కార్యాలయం అరిబండి భవన్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టానికి భారీగా కోతలు పెట్టిన కేంద్ర సర్కార్ కార్పొరేట్ శక్తులకు ఇప్పటికే ఇస్తున్న రూ.లక్షల కోట్ల సబ్సిడీలకు అదనంగా మరో రూ.35 వేల కోట్లు పెంచడం దారుణమన్నారు. పన్ను పరిధిని రూ.5లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడం మినహా ఏ ఒక్కటి దేశ ప్రజలకు మేలు చేసే విధంగా లేవని చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని కొన్నేండ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా మోడీ సర్కార్ పెడచెవిన పెట్టడాన్ని తప్పుపట్టారు. ఎల్‌ఐసిలో వాటాలను అదానికి అమ్మడంతో ఒక్క రోజులోనే రూ.18 లక్షల కోట్ల ప్రజల డబ్బు ఆవిరైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రతిపక్షాలకు సమయం ఇవ్వకపోవడం వీరి నిరంకుశపాలనకు నిదర్శనమన్నారు.

రాష్ట్రంలో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ ఎన్నికల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ బలమైన శక్తిగా ఉండి బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బిజెపికి వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నింటినీ కలుపుకువెళ్లడానికి తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మూడో ఫ్రంట్ అనే వాదనను తోసిపుచ్చారు. అనంతరం పార్టీ నేరేడుచర్ల పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ ఇంటికెళ్లి ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాలేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నీతి, నిజాయితీ నిస్వార్థంతో పనిచేస్తున్న విలేకరులపై కొంతమంది రాజకీయ నాయకులు కక్షగట్టి దాడులు చేస్తున్నారని టిడబ్ల్యూజెఎఫ్, టిడబ్ల్యూజె (ఐజుయు), టిడబ్ల్యూజెహెచ్ 143 జర్నలిస్ట్ సంఘాల నాయకులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం దృష్టికి తీసుకెళ్లారు. శనివారం నేరేడుచర్ల పట్టణంలోని అరిబండి భవన్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు

పేదరికమే గీటురాయిగా కెసిఆర్ పథకాలు

- శాసనసభ్యులు సండ్ర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పేదరికమే గీటురాయిగా సిఎం సంక్షేమపథకాలు రూపొందిస్తున్నారని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చెప్పారు. అందుకే దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందని చెప్పారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. బిజెపి ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నదని చెప్పారు. తెలంగాణ ప్రాంతం ఆనాడు కరువు, వలసలతో అల్లాడిన రాష్ట్రం నేడు సస్యశ్యామలంగా మారిందన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. దళితులు ఆత్మగౌరవంతో బతికేలా దళితబంధు తీసుకొచ్చామన్నారు. కంటివెలుగు లాంటి కార్యక్రమాన్ని పంజాబ్, ఢిల్లీలో చేపడతామని అక్కడి ముఖ్యమంత్రులు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుపెట్టాలని డిమాండ్ చేశారు.

పోడు భూముల ప్రస్తావనే లేదు : పోడెం వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ ప్రసంగంలో పోడు భూముల ప్రస్తావన లేకపోవటం విచారకరమని కాంగ్రెస్ సభ్యుడు పోడెం వీరయ్య తెలిపారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ పోడు భూములకు హక్కు పత్రాలకోసం నాలుగు లక్షలకు పైగా దరఖాస్తులొచ్చాయని తెలిపారు. ఈ అంశాన్ని గవర్నర్ ప్రసంగంలో చేర్చకపోవటం సరికాదన్నారు. సీతరామ సాగర్ నిర్వాసితులకు తగిన నష్టపరిహారం ఇవ్వలేదని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో చాలా చోట్ల తాగు నీటి సౌకర్యం లేదన్నారు. వీటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

- తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ విషయంలో తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి దిగుబడి బాగా తగ్గిందని వివరించారు. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, సగటున ఐదు క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. సీజన్ ప్రారంభంలో క్వింటాల్ పత్తి ధర రూ.9,800లు ఉండగా, దళారీల మోసం వల్ల ఇప్పుడు రూ.ఏడు వేలలోపే అమ్మకాలు సాగుతున్నాయని వివరించారు. వారి లాభాల కోసం రైతులను మోసం చేస్తున్న మార్కెట్ వ్యవస్థలు, కార్పొరేట్ సంస్థలు, మధ్యదళారీలు, కొనుగోలుదారులపై ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం, సిసిఐ జోక్యం చేసుకుని తక్కువ ధరకు కొనుగోలు చేసే దళారీల ఆట కట్టించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో 60 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అయినట్టు ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దాని ధర క్వింటాల్‌కు రూ.12 వేల వరకు ఉండగా, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను రూ.6,600లుగా నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎకరాకు రూ.50 వేల వరకు రైతు ఖర్చు చేస్తుండడంతో రూ.15 వేలు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్య దళారీలు, మార్కెట్ వ్యవస్థలు కుమ్మక్కై ధరలు తగ్గించి కొనుగోలు చేయడం వల్ల రైతులు ఆందోళనకు గురౌతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్ ధరతో సమానంగా సీసీఐతో కొనుగోళ్లను ప్రారంభించాలని సూచించారు. రైతులను మోసం చేస్తున్న దళారీలు, కార్పొరేట్ సంస్థలను అరికట్టాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా పత్తి కొనుగోలు చేసి, మద్దతుధర వచ్చే విధంగా తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపలేను

- మండలిలో కాంగ్రెస్ సభ్యుడు జీవన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాస్తవాలకు భిన్నంగా ఉన్న గవర్నర్ ప్రసంగానికి తాను ధన్యవాదాలు తెలుపలేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి తెలిపారు. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రసంగంలో కొంత మేరకైనా వాస్తవాలుంటే ధన్యవాదాలు తెలిపేవాడినని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి ఆయా రంగాల వారీగా మాట్లాడుతూ విమర్శిస్తుంటే టిఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, భాను ప్రసాద్, ప్రభాకర్‌రావు తదితరులు అభ్యంతరం తెలిపారు. అబద్ధాలాడొద్దంటూ కామెంట్ చేశారు. ఇందుకు బదులుగా జీవన్‌రెడ్డి గవర్నర్ తన ప్రసంగంలో అబద్ధాలే చెప్పారని వ్యాఖ్యానించారు. 24 గంటల విద్యుత్ నిజంగా సరఫరా అవుతుంటే సబ్‌స్టేషన్ల వారీగా శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ పరిధిలో సబ్ స్టేషన్లలో వారీగా నిరంతర కరెంటు రావడం లేదని తెలిపారు. రైతు రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుంటే ఓట్లు అడగబోమని చెప్పాలంటూ సవాల్ విసిరారు. మార్కెట్లలో హమాలీ ఛార్జీల భారం రైతులపై పడుతున్నదనీ, గత ప్రభుత్వాల మాదిరిగా ప్రభుత్వమే ఆయా ఛార్జీలను భరించాలని కోరారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జోక్యం చేసుకుని పండిన ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. దీనికి జీవన్‌రెడ్డి బదులిస్తూ, 'మీరు భావిస్తే సరిపోద్దా?' అంటూ ప్రశ్నించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు బీమా పథకాలు ఎటు పోయాయంటూ ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలైన రైతు సంక్షేమ కార్యక్రమాలను నిలిపేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఖమ్మంలో ఏడు మండలాలను కేంద్రం ఎపిలో కలిపిందనీ, పసుపు బోర్డు ఇవ్వకుండా మోసం చేసిందనీ, ఇంత చేస్తున్నా బిఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తి ఏమైందని ప్రశ్నించారు. కేంద్రంపై బిఆర్ఎస్ పోరాటం చేస్తే తాము కూడా పాల్గొంటామని తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాల పాత్ర కీలకం

- మంత్రి జగదీశ్‌రెడ్డి
- భేరీలు వాయించి పెద్దగట్టు జాతర ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతరను ప్రారంభిస్తున్న మంత్రి

సమాజాన్ని క్రమపద్ధతిలో నడపడంలో ఆయా ప్రాంతాలు, వర్గాల సంస్కృతీ సంప్రదాయాల పాత్ర కీలకమని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని పెద్దగట్టు జాతరలో తొలిఘట్టమైన మకరతోరణం తరలింపు ప్రక్రియను శనివారం స్థానిక గొల్లబజార్, ఎల్లమ్మగుడిలో ప్రత్యేక పూజలు చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి భేరీలు వాయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని కులాలు, మతాలకు సమన్యాయం కల్పించామని చెప్పారు. ప్రజలను ఐక్యం చేయడంలో పెద్దగట్టు వంటి జాతరలు దోహదపడుతాయన్న మంత్రి.. తెలంగాణలో రెండో అతి పెద్ద జాతరకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఆదివారం రాత్రి కేసారం నుంచి దేవరపెట్టె తరలింపు అనంతరం సోమవారం నుంచి సందర్శకులు వస్తారని తెలిపారు. మూడ్రోజుల పాటు రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా 15 లక్షల మంది వరకు తరలివస్తారని అంచనా వేశారు. ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు, డిసిఎంఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్‌పిటిసి జీడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జూలకంటి

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేసి ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆర్‌డిఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపరిచి పేదలకు న్యాయం చేయాలని కోరారు. గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజమైన అర్హులకు ఇంటి స్థలంతోపాటు స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. రేషన్ కార్డులు, పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సూచించారు. సంపద సృష్టించే కార్మికులు, పేదల పట్ల ప్రభుత్వాలు సానుకూలంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆర్‌డిఓ చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి నాయక్, ఐద్వా జిల్లా అధ్యక్షులు పోలబోయిన వరలక్ష్మి, వినోద్‌నాయక్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు రేమిడాల పరశు రాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాగన్ల తయారీ కేంద్రానికి ఎంత భూమి కావాలి?

- కేంద్రానికి బోయినపల్లి వినోద్ సూటి ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాజీపేటలో రైల్వే వ్యాగన్ల తయారీ కేంద్రానికి ఎంత భూమి కావాలో, దాని కోసం ఎన్ని నిధులిస్తురు? ఎంత మందికి ఉద్యోగాలిస్తారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి కొత్త రైళ్ల ప్రస్తావన లేకుండా, కొనసాగుతున్న రైల్వే పనులకు నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ విషయాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టతనివ్వాలని కోరారు. భూమి ఎంత అవసరమో కేంద్రం స్పష్టం చేస్తే, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. రామగుండం - మణుగూరు రైల్వే లైన్ పనులను నిర్ణీత కాలపరిమితి విధించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్లో ఈ పనుల కోసం కేవలం రూ. 10 కోట్లు మాత్రమే కేటాయించారనీ, ఇది ఏ మాత్రం సరిపోదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిజామాబాద్ - ఆర్మూర్ - నిర్మల్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ ఊసే లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే పూర్తయిన కాజీపేట - హుజూరాబాద్ - కరీంనగర్ రైల్వే లైన్‌ను మంజూరు చేస్తారని ఆశించినా.. నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య మూడో రైల్వే లైన్ కోసం మాత్రమే నిధులు కేటాయించారని.. అయితే ఇది దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు కేటాయించినట్టు ఎలా అవుతుందని వినోద్ కుమార్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, కొచ్చిలకు బుల్లెట్ రైలు ప్రస్తావనను కేంద్ర ప్రభుత్వం చేయనేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

- రవాణారంగ కార్మికుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రవాణారంగ కార్మికులు

"రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తూ వెంటనే అసెంబ్లీలో ప్రకటన చేయాలి.. మోటార్ వెహికల్ యాక్ట్-2019 సవరించడంతోపాటు కేరళ తరహాలో యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తేవాలి" అని కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ నెల 7న చలో ఇందిరాపార్కు కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షులు పున్నం రవి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తెలంగాణలోని రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవో నారాయణకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం

- ఎమ్మెల్యే ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొని ప్రజల్లో సానుభూతి పొందే ప్రయత్నం చేస్తుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. 24 గంటలు ఉచిత కరెంటు అని అసెంబ్లీ సాక్షిగా కెటిఆర్ చెప్పిన విషయం శుద్ధ అబద్ధం అన్నారు. దళిత ప్రాంతాల్లో రాత్రిపూట కరెంటు తీసి వాళ్ల అన్నం తినకుండా చేస్తున్నారని, లాండ్రీ, సెలూన్ షాపులకు వంద యూనిట్లలోపు ఉచిత కరెంటు ఎక్కడా సరిగ్గా అమలు కావడం లేదన్నారు. ప్రతిపక్షాలు మాట్లాడకుండా ప్రయత్నం చేస్తున్నారని, దమ్ముంటే ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇవ్వాలన్నారు. అన్నింటికీ కేంద్ర ప్రభుత్వంపై నింద వేస్తున్నారని, ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను పోషించే సత్తా హైదరాబాద్‌కు ఉండేదని, ఇప్పుడు నిధుల కొరత ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దేశంలో కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకుంటున్న రాష్ట్రం ఏదన్నా ఉంది అంటే అది తెలంగాణ మాత్రమేనన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రావడం లేదని, సర్పంచులు, ఉపసర్పంచులు చిన్న పనులు చేస్తున్నా బిల్లులు రావడం లేదన్నారు. స్పీకర్‌ను అడ్డుపెట్టుకొని సంఖ్యా బలంతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం మంచిది కాదన్నారు. పదవులు, అధికారం శాశ్వతం కాదని, ప్రభుత్వానికి ప్రజలు సమాధానం చెప్పే రోజులు చాలా దగ్గరలో ఉన్నాయని తెలిపారు.

అసెంబ్లీలో నాపై వ్యక్తిగత ఆరోపణలు

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభలో తనపై వ్యక్తిగత ఆరోపణలు చేశారని, అధికారంలో ఉన్నవారికంటే ప్రజాశక్తి గొప్పదనేది కెటిఆర్ ఎక్కువ గుర్తుంచుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన శనివారం మాట్లాడారు. 2020 దుబ్బాక ఉప ఎన్నికల్లో తాను ఎటువంటి పాంప్లెట్‌నూ ముద్రించలేదని, సభలోకి తెచ్చిన పాంప్లెట్ 2018 సాధారణ ఎన్నికలప్పుడు ముద్రించిందని, దానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. అదే సమయంలో 2014లో మీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని మంత్రి కెటిఆర్‌ను ప్రశ్నించారు. చేగుంటకు డిగ్రీ కాలేజ్.. దుబ్బాకకు రింగు రోడ్డు ఇవ్వాల్సింది ఎవరని ప్రశ్నించారు. 103 మంది ఎమ్మెల్యేలు ఉన్నామని, అహంకారం పనికిరాదు.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. నేను ఇచ్చిన మ్యానిఫెస్టోకు కట్టుబడి ఉంటానని, తాము అధికారంలోకి వచ్చాక అమలు చేసి చూపిస్తానని చెప్పారు. హామీలు, నిధులపై అడిగితే కేటీఆర్ తెలంగాణ తొమ్మిదేండ్ల పసిగుడ్డు అంటున్నారని, అలాంటప్పుడు రెండేండ్ల పసిగుడ్డు అయిన తాను చేయడానికి కూడా సమయం పడుతుందన్నారు. రెండు నిమిషాలు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పించుకొని పారిపోయారని ఎద్దేవా చేశారు.

జర్నలిస్టులకూ ఇళ్ల స్థలాలివ్వాలి

- అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ ప్రసంగంలో పేదలకు ఇళ్ల స్థలాల ఊసే లేకపోవటం విచారకరమని శాసన సభలో కాంగ్రెస్ సభ్యుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. పేదోళ్ళకు వంద గజాల ఇళ్ల స్థలం ఇచ్చే జిఓను మళ్ళీ తీసుకురావాలని కోరారు. రైతు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు నిధుల్లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సహాయాన్ని రూ.2 లక్షలు పెంచాలన్నారు. కేన్సర్ రోగుల సమస్యలపై ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యం కోసం ఆ కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని గుర్తుచేశారు. యాదాద్రికి మెట్రో రైల్ ఏర్పాటు చేయాలనీ, సంగారెడ్డికి కూడా మెట్రోను విస్తరించాలని కోరారు. నిరుద్యోగ భతి కింద ఇస్తామన్న రూ. 3,016 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలు గవర్నర్ ప్రసంగంలో లేవని గుర్తుచేశారు.